సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 8 । నవంబర్ । 2023



సోమశిలలో 29.920 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 29.920 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 526 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు(10 గ్రాములు)	రూ.62,500
22 క్యారెట్లు ఆర్నమెంటు(గ్రా)	రూ.5,612
3శాతం జీఎస్టీతో	రూ.5,780
సవర(8గ్రాములు)	రూ.46,240

గరిష్టం/కనిష్టం
30.0 /25.6

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 95 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

అబ్దుల్ అజీజ్‌కు నోటీసులు

నెల్లూరు(క్రైమ్): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు బాలాజీనగర్ పోలీసులు మంగళవారం 41(ఎ) సీఆర్‌పీసీ కింద నోటీసులు అందజేశారు. ఈ ఏడాది మార్చి 13న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కర్నాలమిట్ట ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద అబ్దుల్ అజీజ్ విధి నిర్వహణలో ఉన్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్‌పై దౌర్జన్యం చేశారు. దీనిపై బాధిత ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా పోలీసులు అబ్దుల్ అజీజ్‌కు నోటీసులు జారీ చేశారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్/ఐటీఐఈ ఉత్తీర్ణులైన 30 మంది యువతీ యువకులకు ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందే అవకాశం ఉందని తెలిపారు. అర్హత సాధించిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్, ప్రముఖ హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 15వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9160912690, 9701343846, 9032697478 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వైద్యారోగ్యశాఖలో అక్రమాలపై విచారణ

నెల్లూరు సిటీ: జిల్లా వైద్యారోగ్యశాఖలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఉద్యోగాలు రిక్రూట్‌మెంట్‌లో అవినీతి జరిగిందనే ఆరోపణలతో డీఎంహెచ్‌ఓపై రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ విజయరాణి మంగళవారం నెల్లూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి విచ్చేశారు. ఫిర్యాదులోని పలు అంశాలపై కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిని విచారించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

వెంకటాచలం: మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ జి.పద్మనాభం, వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి.. అభివృద్ధి ఝరి

పినాకిని సాక్షిగా జిల్లా కేంద్రం ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. నెల్లూరు నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనుల కోసం రూ.వంద కోట్లకు పైగా నిధులు కేటాయించి ఖర్చు చేసింది. ఈ నిధులతో నెల్లూరు నగరంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కల్వర్టులు, పైపులైన్లు తదితర సమస్యలు దాదాపుగా పరిష్కారమయ్యాయి.

నెల్లూరు నగర ప్రగతికి భారీగా నిధులు

- ఇప్పటికే రూ.100 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యం
- నగరంలో జంక్షన్ల అభివృద్ధి
- తీరనున్న ట్రాఫిక్ సమస్య

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత టీడీపీ ఐదేళ్ల పాలనలో నెల్లూరు నగర అభివృద్ధి, అండర్ డ్రైనేజీ, అంతర్గత రహదారుల పేరుతో ఆ పార్టీ నేతలు నిధులు బొక్కేశారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ పేరుతో రోడ్లను తవ్వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక నగరం మురికికూపంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యలకు చెక్ పెట్టింది. సింహపురి రూపురేఖలు మారుతున్నాయి. ప్రధానంగా నెల్లూరు నగరంలోని జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని 12 జంక్షన్లను సుందరంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే రూ.100 కోట్లు ఖర్చు చేశారు.

నగరాభివృద్ధికి కృషి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నెల్లూరు నగరాభివృద్ధికి నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్, మేయర్ పొట్లూరి స్రవంతి కృషి చేస్తున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆయన సూచనలతో నగరాభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.



జేవీఆర్ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

ట్రాఫిక్ సమస్యకు చెక్

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని జంక్షన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పనులు ప్రారంభించింది. నగరంలోని పలు జంక్షన్లను ఆధునీకరిస్తూనే అవసరం ఉన్న చోట్ల అదనంగా జంక్షన్లను ఏర్పాటు చేయనుంది. తద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది.

నిధులు ఇవిగో..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జిల్లా కేంద్రంలో రూ.46.60 కోట్లతో 598 పనులు మంజూరయ్యాయి. రూ.18.93 కోట్లతో 288 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. 182 పనులు పురోగతిలో ఉండగా, మిగిలిన 128 పనులు జరగాల్సి ఉంది.

ప్రజారోగ్యానికి పెద్దపీట

➡ నెల్లూరు నగరంలో రూ.10.40 కోట్లతో 13 వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను కొత్తగా మంజూరు చేయగా, ఇందులో 12 యూపీహెచ్‌సీల నిర్మాణం పూర్తి కాగా, మరొకటి పూర్తయ్యే దశలో ఉంది.



నెల్లూరు నగరంలో విశాలంగా ప్రధాన రోడ్డు

➡ 2020–21 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.43.60 కోట్లతో 140 పనులు ప్రతిపాదించగా, అందులో రూ.16.61 కోట్ల విలువైన 70 పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

➡ 2021–22 సంవత్సరానికి సంబంధించి రూ.10.22 కోట్లతో 28 పనులు ప్రతిపాదించగా, అందులో రూ.2.92 కోట్ల విలువైన 8 పనులు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

కొత్త కార్యక్రమానికి శ్రీకారం

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా, డ్రైనేజీ, చెత్త సేకరణ, వీధిదీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ 14వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్స్, సఫాయి మిత్ర ప్రైజ్ మనీ వంటి వివిధ వనరుల నుంచి రూ.8.5 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సమస్యలను గుర్తించి పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నారు.



నాడు–నేడు ద్వారా తీర్చిదిద్దిన దర్గామిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

నాడు–నేడుతో ప్రగతి

నాడు–నేడు ఫేజ్–2 కార్యక్రమంలో భాగంగా 47 ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం రూ.31 కోట్లు కేటాయించింది. అందులో భాగంగా 101 అదనపు తరగతి గదులు స్లాబ్ లెవల్‌ను పూర్తి చేశారు.

కార్పొరేషన్ జనరల్ ఫండ్స్

2023–24 సంవత్సరానికి సంబంధించి పురపాలకశాఖ రూ.19.75 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించగా, ఇప్పటికే రూ.4.83 కోట్లతో 67 పనులు పూర్తి చేశారు. రూ.4.83 కోట్లతో 49 పనులు పురోగతిలో ఉన్నాయి. అలాగే రూ.5.69 కోట్లకు సంబంధించిన 74 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. రూ.4.43 కోట్లకు సంబంధించిన 40 పనులకు టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉంది.

ఎంతో మార్పు



గతంలో నెల్లూరు నగరం సాదాసీదాగా కనిపించేది. ఇటీవల కాలంలో నగరంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా రోడ్లు బాగా కనిపిస్తున్నాయి. పలు కూడళ్లను అభివృద్ధి చేయడంతో ఎంతో మార్పు కనిపిస్తోంది. ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది.

– సుబ్బారెడ్డి, బంగ్లాతోట

చూడముచ్చటగా ఉంది



ఇటీవల నగరంలో పచ్చదనం పరుచుకుంది. ప్రధాన కూడళ్లన్నీ బాగుపడ్డాయి. నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. చిల్డ్రన్స్ పార్కును సుందరంగా తీర్చిదిద్దడం సంతోషకరంగా ఉంది. ప్రస్తుతం నెల్లూరు చూడముచ్చటగా ఉంది.

– చిలమత్రి సుధాకర్, బాలాజీనగర్

నగరంలో అభివృద్ధి ఛాయలు



గత ప్రభుత్వంలో నెల్లూరు నగర అభివృద్ధిని పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరం ఎంతో అభివృద్ధి చెందింది. ఎక్కడ చూసినా అభివృద్ధి ఛాయలు కనిపిస్తున్నాయి. నెల్లూరు నగర అభివృద్ధిని చూసి ప్రజలు సంతోషిస్తున్నారు.

– నందిమండలం సాయిబాబా, ఉమ్మారెడ్డిగుంట

జగనన్న ప్రభుత్వంలో రైతుకు భరోసా

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి
- పుట్టపర్తి నుంచి రైతుభరోసా నిధులు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండగలా చేశారని, రైతులకు అన్నివిధాలా అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా ఐదో ఏడాది రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీతోపాటు కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల మంది రైతులకు రెండో విడత రైతుభరోసా – పీఎం కిసాన్ నగదు దాదాపు రూ.90 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయరంగానికి అతి కీలకమైన పథకం రైతు భరోసా అని, రైతులకు పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం జిల్లాలో రైతుభరోసాకు సంబంధించిన నమూనా చెక్‌ను రైతులతో కలిసి వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజు, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి

రైతులకు అండగా ప్రభుత్వం: నిరంజన్‌బాబురెడ్డి

విత్తనం నాటడం నుంచి ధాన్యం విక్రయించుకునే వరకు ప్రతి అడుగులోనూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ అని చెబితే, ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగలా చేసిందని తెలిపారు. రైతులకు గ్రామస్థాయిలోనే అన్ని సేవలు అందించేలా రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

ఏ రాష్ట్రంలో కూడా లేనివిధంగా వ్యవసాయ సీజన్‌కు ముందుగానే రైతులకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని, వ్యవసాయానికి మేలు జరిగేలా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ఏదైనా సమస్యలతో రైతుభరోసా నిధులు జమ కాకపోతే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

రైతుకు ఇలా ఎవరూ సాయం చేయలేదు



నేను మా గ్రామంలో ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. నాకు క్రమం తప్పకుండా రైతుభరోసా డబ్బులు పడుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా చాలా మంది ముఖ్యమంత్రులను చూశాం. సీఎం వైఎస్ జగన్ రైతులకు మేలు చేసినట్లు ఎవరూ చేయలేదు.

– బిక్కి వెంకటాద్రి, రైతు, రాపూరు

సీఎం చెప్పినవన్నీ చేస్తున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న రైతుభరోసా పథకం మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మా ఊర్లోని రైతుభరోసా కేంద్రం సిబ్బంది పంటల సాగుకు సంబంధించి మాకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ ఏడాది ధాన్యం దిగుబడి బాగా వచ్చి మంచి ధర పొందాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినవన్నీ చేస్తున్నారు.

– సుధాకర్‌రెడ్డి, రైతు, చిన్న చెరుకూరు

జిల్లాలో 10 మి.మీ. వర్షపాతం



నెల్లూరులో జోరుగా కురుస్తున్న వర్షం

నెల్లూరు(దర్గామిట్ట): బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తన ద్రోణి ప్రభావంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మెట్ట రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మంగళవారం సగటున 10 మి.మీ. వర్షపాతం నమోదైంది. వలేటివారిపాళెంలో 78.4 మి.మీ., కందుకూరులో 38.4, తోటపల్లి గూడూరులో 32.8, ఉలవపాడులో 24.8, బుచ్చిరెడ్డిపాళెంలో 24.2, ముత్తుకూరులో 20.4, అనంతసాగరంలో 15.6, విడవలూరులో 14.2, జలదంకిలో 13.4, కోవూరులో 11.6, కలువాయిలో 11.2, అల్లూరులో 10.4, గుడ్లూరు మండలంలో 10.2 మి.మీల వర్షపాతం నమోదైంది.

లాభాల వల వేసి.. డబ్బు లాగేసి..

ముచ్చటైన కమీషన్లు.. కళ్లెదుటే లాభాలు.. చుట్టుపక్కల వాళ్లను జత చేస్తే బోనస్‌లు, ఇన్సెంటివ్‌లు. తేరగా వస్తున్న డబ్బును చూసి చాలా మందికి ఆశ కలిగింది. ఒకరిని చూసి మరొకరు చేరుతుండడంతో కంపెనీ వేగంగా విస్తరించింది. నోటి మాట ద్వారానే విస్తృత ప్రచారం వచ్చింది. వ్యాపారం రూ.కోట్లకు చేరింది. అంతా సజావుగా సాగుతున్నట్టు అనిపించినా.. ఒకానొక రాత్రి కంపెనీ చీకట్లో కలిసిపోయింది. బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.



పోలీసుల అదుపులో 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ మోసగాళ్లు

- 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ పేరిట మోసం
- గొలుసు విధానం ద్వారా విస్తరణ
- ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

రాయచోటి టౌన్: 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ పేరుతో ప్రజలను మోసం చేసిన వారిని అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మహబూబ్‌బాషా మంగళవారం వెల్లడించారు. తిరుపతికి చెందిన రసూల్ సాహెబ్ 2019లో యోగానందచౌదరితో కలిసి 9 ఎఫ్ఎక్స్ పేరుతో ఓ కంపెనీ ప్రారంభించారు. కొందరిని ఏజెంట్లుగా చేర్చుకున్నారు. 20 మంది ఖాతాదారులతో ఒక గ్రూప్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరితో రూ.లక్ష వసూలు చేశారు. ప్రతి నెలా లక్కీడిప్ తీస్తారు. డిప్ తగిలిన వారికి పెట్టుబడి తిరిగివ్వడంతోపాటు మరో రూ.50 వేలు అదనంగా ఇచ్చి స్కీమ్ నుంచి తొలగిస్తారు. మిగిలిన 19 మందికి నెలకు రూ.3 వేలు చొప్పున కమీషన్ ఇస్తారు. అలాగే వీరిని పరిచయం చేసిన వారికి రూ.2,000, రూ.1,000 చొప్పున కమీషన్ ఇస్తారు. ఇలా 20 నెలలు నిర్వహించి సభ్యుడికి తాను పెట్టిన పెట్టుబడితోపాటు మరో రూ.లక్ష వచ్చేలా ఆశ చూపారు.

బ్రాంచ్‌ల ఏర్పాటు

రాయచోటికి చెందిన సుబ్బారెడ్డి ద్వారా తిరుపాల్‌రెడ్డి, ఆయన ద్వారా కడపకు చెందిన చంద్రమౌళీశ్వరరెడ్డి, అతని ద్వారా నెల్లూరుకు చెందిన మల్లికార్జునరావు, రాయచోటికి చెందిన రాజేష్ యజమానులుగా వారికి వారే మార్చుకొని బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. వీరు మొదట తిరుపతి, తరువాత నెల్లూరు, కడప, రాయచోటిలలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేశారు. ఏజెంట్ల సంఖ్య 302 మందికి చేరింది. మొత్తం 1,759 మంది ఖాతాదారులను చేర్చుకుని, రూ.170 కోట్లకు పైగా వసూలు చేశారు. సభ్యులు చెల్లించిన డబ్బులతో చెప్పిన విధంగా స్కీం నిర్వహించారు. రూ.105 కోట్ల వరకు తిరిగి ఇచ్చేశారు. ఇందులో నుంచి రూ.65 కోట్లు ఏజెంట్లు, ప్రమోటర్లకు ఇచ్చారు. అప్పటి నుంచి వీరి లావాదేవీలు, వ్యాపారం ఆగిపోయింది. వినియోగదారులకు చెప్పకుండానే 2023 ఏప్రిల్‌లో బోర్డు తిప్పేశారు.

ప్లాట్లు తెరపైకి తెచ్చి..

తరువాత రసూల్ సాహెబ్, యోగానందచౌదరి కలిసి మిగిలిన డబ్బుతో నెలూరు జిల్లా నందిపాడు వద్ద 22 ఎకరాల పొలం కొనుగోలు చేశారు. దానికి గోల్డెన్ ఫాం అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఎర్రచందనం చెట్లు నాటించి, దానికి మల్లికార్జునరావుని డైరెక్టర్‌గా నియమించారు. ఆ 22 ఎకరాల్లో ప్లాట్లు వేసి, వాటిని మిగిలిన సభ్యులకు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మళ్లీ బోర్డు తిప్పేయడంతో సభ్యులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. రసూల్ సాహెబ్, యోగానందచౌదరి, సుబ్బారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మల్లికార్జునరావు, రాజేష్‌లను అదుపులోకి తీసుకొని, కోర్టులో హాజరుపరిచారు. సమావేశంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, అర్బన్ ఎస్‌ఐ నరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మనస్సుదోచే
పూదోట

నెల్లూరు నగరంలోని పూల నర్సరీలు, క్రోటన్స్ మొక్కలు ప్రకృతి ప్రేమికుల మనస్సులను దోచుకుంటున్నాయి. మినీబైపాస్ రోడ్డు, రామలింగాపురం, ముత్తుకూరు రోడ్డులో పూలమొక్కల నర్సరీలు ఉన్నాయి. నీటిని అందిస్తూ మొక్కలు చక్కగా వికసించేలా నిర్వాహకులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. మొక్కలను కుండీల్లో అమర్చి కొనుగోలుదారులకు విక్రయిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు






అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రంగయ్య(ఫైల్)

వెంకటాచలం : మండలంలోని తిరుమలమ్మ పాళెం వద్ద కండలేరు క్రీక్ కెనాల్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు స్థానికులు మంగళవారం ఉదయం గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుమలమ్మపాళెం గ్రామానికి చెందిన బొమ్మిశ్ల రంగయ్య(50) సోమవారం రాత్రి నుంచి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి మంగళవారం ఉదయం గాలించారు. అయితే గ్రామానికి సమీపాన ఉన్న కండలేరు క్రీక్ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉందని తెలియడంతో అందరూ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాలువలో ఉన్న మృతదేహం రంగయ్యదేనని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. రంగయ్య మృతదేహాన్ని చూసి అతని భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రంగయ్య నివాసంలో ఉన్న రూ.2 లక్షల నగదు కనిపించకపోవడం, రంగయ్య మృతదేహం కాలువలో తేలడంపై కారణాలు అంతుపట్టడం లేదు. రంగయ్య భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బండారుపల్లి సమీపంలో..


మృతుడు రవీంద్ర (ఫైల్)

ఆత్మకూరు : మండలంలోని బండారుపల్లి గ్రామ సమీపంలో ఏటికాలువ ఒడ్డున మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వారి వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం తాతిరెడ్డిపల్లికి చెందిన వల్లెపు రవీంద్ర (34) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. నాలుగు రోజుల క్రితం ఆత్మకూరుకు వెళ్తున్నట్లు ఇంటి నుంచి సొంత ఆటోలో వెళ్లాడు. రెండు రోజులు గడిచినా ఇంటికి రాకపోవడంతో భార్య రాధమ్మ పలుచోట్ల విచారించి ఆత్మకూరు పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో బండారుపల్లి గ్రామ సమీపంలో మృతదేహం వెలుగులోకి రావడంతో పోలీసులు పరిశీలించగా వల్లెపు రవీంద్రగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హత్య.. లేక ఆత్మహత్య? అనే కోణంలో దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సైలు ముత్యాలరావు, సాయిప్రసాద్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి


మృతురాలు

నెల్లూరు(క్రైమ్) : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. కుసుమ దళితవాడ సమీపంలో గుర్తుతెలియని మహిళ(42) సోమవారం రాత్రి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నవాబుపేట పోలీసులను సంప్రదించాలని స్థానిక ఎస్సై రెహమాన్ విజ్ఞప్తి చేశారు.

ప్రజానేత రాయసం వెంకటేశ్వరరావు

• ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


రాయసం వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్న

ఇందుకూరుపేట : ప్రజానేతగా, అజాత శత్రువుగా రాయసం వెంకటేశ్వరరావు కీర్తి గడించారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో మాజీ సర్పంచ్ రాయసం వెంకటేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని మంగళవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరరావు విగ్రహావిష్కరణలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2004 సునామీ సమయంలో ఆయన సేవలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఆహారం, పునరావాసం ఏర్పాటు చేసి అండగా నిలిచారన్నారు. గ్రామానికి సేవ చేసుకునే అవకాశం చాలా తక్కువ మందికి వస్తుందని, దానిని అద్భుతంగా వినియోగించుకుని గ్రామాభివృద్ధికి కృషి చేశారని వివరించారు. రెండుసార్లు సర్పంచ్‌గా, మూడు దఫాలు ఉపసర్పంచ్‌గా ఆయన చేసిన సేవలు అమోఘమని కీర్తించారు. వెంకటేశ్వరరావు కుమారులు వాసుదేవరావు, దామోదర్‌రావు, హృషీకేశవరావు ఆయన జాడల్లో నడవాలని ఆకాంక్షించారు.

ప్రజాసేవకు నిర్వచనం – ఎమ్మెల్యే ప్రసన్న

వెంకటేశ్వరరావు నాయుడు తన 80 ఏళ్ల జీవితంలో ప్రజాసేవకు నిర్వచనం చెప్పిన సామాన్యుడు అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశంసించారు. కొంత మంది మాత్రమే మనస్సున్న నేతలుగా నిలిచిపోతారని, ఆ కోవకు చెందిన వ్యక్తి వెంకటేశ్వరరావు నాయుడు అని చెప్పారు. ఆయన విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రసన్న పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

• కలెక్టర్ హరినారాయణన్


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్ పక్కన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట) : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, జేసీ కూర్మనాథ్‌లతో కలిసి ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లతో కలెక్టర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో నోషనల్ ఖాతాలు, చుక్కల భూములు, సాదాబైనామా, సీజెఎఫ్ఎస్ లబ్ధిదారులకు డీకేటీ పట్టాల పంపిణీ తదితర వివిధ భూ సమస్యల అర్జీలపై దృష్టి సారించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా సాగుబడిలో ఉన్న భూమికి అర్హత మేరకు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 15న భూ పంపిణీ కార్యక్రమం ఉన్నందున సచివాలయం వారీగా గ్రామసభల్లో భూమి లేని నిరుపేదల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను వెంటనే పంపాలని ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి పూర్తిస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడీ హనుమాన్‌ప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

బాబు చేతిలో అన్నివర్గాలు దగా

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
• రేపు కావలిలో సామాజిక బస్సు యాత్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : చంద్రబాబు హయాంలో రాజకీయంగా, ఆర్థికంగా అన్ని వర్గాలు దగాకు గురయ్యాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహంతో ఆయా వర్గాల్లో చైతన్యం వెల్లివిరుస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి నియోజకవర్గంలో రేపు మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని బాబు మోసం చేస్తే, జగనన్న నాలుగు విడతలుగా చెల్లిస్తున్నారని తెలిపారు. రైతుల రుణాలు మాఫీ చేస్తానని బాబు మోసం చేస్తే, జగనన్న రైతు భరోసా ఇస్తున్నారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. ఈ పథకాలు జగనన్న సీఎంగా ఉంటేనే కొనసాగుతాయని తెలియజేశారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత జగనన్న పాలనలోనే సామాజిక సాధికారత సాధ్యమైందన్నారు. కాగా బోగోలు మండలం కడనూతల జాతీయ రహదారిపై ఆరెస్సార్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు బస్సు యాత్ర బయలుదేరుతుందన్నారు. అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా మద్దూరుపాడు వద్ద కావలి పట్టణంలోకి చేరుకుని, పొట్టిశ్రీరాములు విగ్రహం కూడలిలో సాయంత్రం 4 గంటలకు సభ జరుగుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, జనిగర్ల మహేంద్రయాదవ్, చెన్ను ప్రసాద్ రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, కె.కామయ్య, షేక్.షాహుల్ హమీద్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆక్రమిస్తే చర్యలు

• వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఖుదావన్


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్

అనుమసముద్రంపేట : వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తులను ఆక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ షేక్ ఖుదావన్ అన్నారు. ఏఎస్‌పేట మండలం హసనాపురంలో సర్వే నంబర్ 425లో వక్ఫ్‌బోర్డుకు సంబంధించి 3.61 ఎకరాల భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా ఆ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వక్ఫ్‌బోర్డు స్థలాల్లో అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ హనుక్ బాబుకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వక్ఫ్‌బోర్డు స్థలాల్లో అక్రమ కట్టడాలను తొలగించుకోవాలని సూచించామన్నారు. లేనిపక్షంలో తామే పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో తొలగిస్తామన్నారు.

కామాక్షితాయి సేవలో అడిషనల్ ఎస్పీ


ప్రసాదాలు స్వీకరిస్తున్న ఏఎస్పీ హిమవతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు అడిషనల్ ఎస్పీ డి.హిమవతి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతిస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కామాక్షితాయి హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ గిరికృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 16వ తేదీ నుంచి నవంబర్ 7వ తేదీ వరకు ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.45,66,929 నగదు, 10 సింగపూర్ డాలర్లు, 20 లండన్ పౌండ్స్, 185 గ్రాముల బంగారం, 383 గ్రాముల వెండి ఆలయానికి సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.50
సన్నవి : రూ.20
పండ్లు : రూ.6

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.106
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.192
స్కిన్‌లెస్ చికెన్:	రూ.212
లేయర్ చికెన్:	రూ.178

'ఆసక్తి ఉంటే అనంత విశ్వాన్ని మథించవచ్చు' అనడానికి ప్రతీక శకుంతలాదేవి. అరవై దాటిన తర్వాత యూ ట్యూబర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యారు. అంతకంటే ముందు ఆమె తనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకున్నారు. ఆ ప్రపంచంలో సంగీతం, సాహిత్యం, మొక్కల పెంపకం ఉన్నాయి. ఇప్పుడు డిజిటల్ మీడియా వేదికగా సృజనాత్మకతను పంచుతున్నారు. భర్త బాటలో తాను కూడా మరణానంతరం దేహాన్ని డొనేట్ చేశారు.

అర్థవంతమైన జీవితం


శకుంతలాదేవి

శకుంతలాదేవి అత్యంత సాధారణ గృహిణి. నలుగురు పిల్లల్ని పెంచుతూ ఆమె తన అభిరుచులను కొనసాగించారు. సాహిత్యాన్ని ఆస్వాదించకుండా ఉట్టిగా పాటలు వినడంలో ఏదో అసంతృప్తి. అందుకే హిందీ పాటల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి హిందీ– తెలుగు డిక్షనరీలో అర్థాలు వెతుక్కున్నారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాలను ఉబుసుపోని పోస్టులకు పరిమితం చేయలేదామె. సాంకేతిక పాఠాలను స్మార్ట్‌ఫోన్‌తోనే నేర్చుకున్నారు. వీడియో రికార్డ్ చేయడం, ఎడిటింగ్, థంబ్‌నెయిల్ పెట్టడం, యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం వరకు అవసరమైనవి అన్నీ సొంతంగా నేర్చుకున్నారు. తనకు తెలిసిన మంచి విషయాలను డిజిటల్ మీడియా వేదికగా ప్రపంచంతో పంచుకుంటున్నారు. 'నన్ను ప్రపంచానికి తెలియచేసిన యూట్యూబ్‌కి తొలుత కృతజ్ఞతలు' అంటూ తన వివరాలను 'సాక్షి'తో పంచుకున్నారు స్వర్ణ శకుంతలాదేవి.

ఆధ్యాత్మికం నుంచి అభ్యుదయం వరకు ...

''మాది తెనాలి దగ్గర మూల్పూరు గ్రామం. నాన్న వ్యవసాయంతోపాటు గుడిలో పూజలు చేసేవారు. ఏడుగురు సంతానం. ఐదుగురు అమ్మాయిల్లో ఎస్‌ఎస్‌ఎల్‌సీ వరకు చదివింది నేనే. మా వారు బీఏఎమ్‌ఎస్ చదువుతూ ఉండడంతో ఆయన చదువు పూర్తయ్యే వరకు, నాకూ చదువుకునే అవకాశం వచ్చింది. ఫిఫ్త్‌ఫారమ్‌లో ఉండగా పెళ్లయింది. తర్వాత పుట్టింట్లోనే ఉండి ఎస్‌ఎస్‌ఎల్‌సీ పూర్తి చేసి రిజల్ట్స్ వచ్చే నాటికి చీరాలలో అత్తగారింటిలో ఉన్నాను. అప్పట్లో ఆ చదువుకే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగం ఇచ్చేవారు. మా అత్తగారు 'ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముందిప్పుడు' అనడంతో ఇంటికే పరిమితమయ్యాను. టీచర్ అయ్యే అవకాశం అలా చేజారింది. కానీ మా వారి నుంచి ప్రోత్సాహం మాత్రం ఎప్పుడూ ఉండేది. ఆయన ఆయుర్వేద వైద్యులుగా ఒంగోలు దగ్గర అమ్మనబ్రోలులో ప్రాక్టీస్ చేసేవారు. అక్కడే 35 ఏళ్ల పాటు ఉన్నాం. ఇద్దరు పిల్లలు పుట్టిన తరవాత వీణ నేర్చుకున్నాను. ఆ తర్వాత మరో ఇద్దరు పిల్లలు. వాళ్లందరి ఆలనపాలన చూస్తూ నా అభిరుచులను కొనసాగించగలిగాను. ఆధ్యాత్మిక గ్రంథాల నుంచి రంగనాయకమ్మ రాసిన బలిపీఠం, కౌసల్యాదేవి– చక్రవాకం, రవీంద్రనాథుని గీతాంజలి, బాలగంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రి.. ఇలా అదీ ఇదీ అనే వర్గీకరణ లేకుండా చదివేదాన్ని. యద్దనపూడి, మాదిరెడ్డి, యండమూరి, శ్రీశ్రీ రచనలను, అబ్దుల్‌కలామ్ వంటి ప్రముఖుల జీవిత చరిత్రలను ఇష్టంగా చదివాను. కొన్ని రచనలు రేడియోలో నాటికలుగా వచ్చేవి. వాటి కోసం రేడియోకి అంకితమయ్యేదాన్ని. ఇలా సాగుతున్న జీవితంలో పిల్లలు నలుగురూ సెటిల్ అయిన తర్వాత మా వారు ప్రాక్టీస్ చాలించారు. 2005లో చీరాలకు వచ్చాం.

పెద్దబ్బాయి కొత్తదారిలో నడిపించాడు

మా పెద్దబ్బాయి నన్ను కొత్తగా ఆవిష్కరించాడు. తను మెకానికల్ ఇంజనీర్. తాను ఆసక్తి కొద్దీ జెమాలజీ కోర్సు చేశాడు. రత్నాల గురించిన కబుర్లు నాకు ఎక్కువ ఆసక్తినివ్వడంతో రత్నాలకు – రాళ్లకు మధ్య తేడాను గుర్తించడం నేర్పించాడు. ముత్యాలు, పగడాలతోపాటు రకరకాల బీడ్స్, జెమ్స్, సెమీ ప్రెషియస్ స్టోన్స్‌తో ఆర్నమెంట్ మేకింగ్ నేర్పించాడు. జీవితాన్ని మనం ఎంత ఉత్సాహవంతంగా, రాగరంజితంగా మార్చుకున్నప్పటికీ ఏదో ఒక వెలితిని సృష్టించి ప్రశ్నార్థకంగా మన ముందు పెడుతుంది. నా అభిరుచులు మాత్రమే నాతో మిగిలాయి, వాటిని ప్రోత్సహించిన మావారు మాకు దూరమయ్యారు. ఆయన కోరిక మేరకు దేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం ఒంగోలులో మెడికల్ కాలేజీకి ప్రదానం చేశాం. ఆయన బాటలో నేను కూడా మరణానంతరం నా దేహాన్ని డొనేట్ చేస్తూ సంతకం చేశాను. మనం జీవిస్తూ మరొకరికి ఉపయోగం కలిగించడమే జీవితానికి అసలైన అర్థం అని నమ్ముతాను. ఆయన జ్ఞాపకాలతో రోజులు సాగుతున్న సమయంలో కోవిడ్ ప్రపంచాన్ని కుదిపేసింది.

యూ ట్యూబ్ ఆత్మీయులనిచ్చింది

కోవిడ్ సమయంలో అగాధంలాంటి విరామం. ఆ విరామం ఎంత కాలమో కూడా తెలియదు. యూ ట్యూబ్ చానెల్స్ చూస్తూ, మా వారు సుబ్రహ్మణ్య కుమార్ రాసిన వైద్య గ్రంథాన్ని చదువుతూ గడిపాను. అప్పుడు నాక్కూడా నాకు తెలిసిన సంగతులు చెప్పాలనిపించింది. గూగుల్ లేని రోజుల్లోనే నిత్యాన్వేషిగా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. చేతిలోకి స్మార్ట్‌ఫోన్ వచ్చిన తర్వాత ఇక కష్టమేముంది? యూ ట్యూబ్‌కి సంబంధించిన పరిజ్ఞానమంతా 'హౌ టూ అప్‌లోడ్, హౌ టూ డూ ఎడిటింగ్, హౌ టూ డూ థంబ్‌నెయిల్' అంటూ 'హౌ టూ' అని అడుగుతూ నేర్చుకున్నాను. మొదట వంటలు, ఇంటి అలంకరణ, మా వారు రాసిన వైద్యగ్రంథంలోని విషయాలను చెప్పాలనుకుని 2021లో యూ ట్యూబ్ చానెల్ మొదలుపెట్టాను. కొంతకాలం తర్వాత యూ ట్యూబ్ గుర్తించాలంటే ఏదో ఒక టాపిక్ మీదనే దృష్టి పెట్టమని సూచించారు పిల్లలు. వంటలు చాలామంది చేస్తున్నారు. ముత్యాలు, పగడాల గురించి చాలామందికి తెలియని సంగతులు చాలా ఉన్నాయి. వాటి గురించి చెప్పమన్నారు మా పిల్లలు. ఆ తర్వాత నాకు సబ్‌స్క్రైబర్స్ రెండున్నర లక్షలకు పెరగడంతోపాటు ఫాన్ ఫాలోయింగ్ కూడా పెరిగింది. డాక్టర్‌లు, సైంటిస్ట్‌లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు... సందేహాలడుగుతుంటే నాకు తెలిసినదెంత? ఇంత పెద్ద చదువులు చదువుకున్న వాళ్ల సందేహాలు నేను తీర్చడమేమిటని ఆశ్చర్యంగా ఉంటుంది కూడా. అసలు ముత్యాన్ని, నకిలీ ముత్యాన్ని ఎలా గుర్తించాలి, తైవాన్ పగడం ఎలా ఉంటుంది, ఇటాలియన్ పగడాలెలా ఉంటాయి, వేటిని క్యారట్‌లలో తూస్తారు, వేటిని గ్రాముల్లో తూస్తారు... వంటి విషయాలనెన్నో చెప్పాను. యూ ట్యూబర్‌గా నేను డబ్బుకంటే వెలకట్టలేని ఆత్మీయతను, అభిమానాన్ని సంపాదించుకున్నాను. ఆంటీ, అమ్మా అనే పిలుపులతోపాటు ఈ తరం యువతులు వాళ్ల సందేహాల కోసం ఫోన్ చేసి 'అమ్మమ్మా' అని పిలుస్తుంటే చాలా సంతోషంగా ఉంటోంది. మనిషి, మెదడు పని లేకుండా ఖాళీగా ఉండకూడదు. అలాగే ఎంటర్‌టైన్‌మెంట్ మన మైండ్‌ని చెడగొట్టకూడదని నమ్ముతాను. అందుకే టీవీ సీరియల్స్ నన్ను ఆకర్షించలేదు. నాకు నేనుగా సమయాన్ని ఇలా ఆనందంగా, ఉపయుక్తంగా మలుచుకున్నాను'' అన్నారు శకుంతలాదేవి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళ



ఆర్ట్ సైంటిస్ట్

ఆర్ట్, ఫ్యాషన్‌ను కలిపి తనదైన కళను ఆవిష్కరించింది ఢిల్లీకి చెందిన **పాయల్ జైన్.**

ఫ్యాషన్ రంగంలో పేరుగాంచిన పాయల్ జైన్ మంచి ఆర్టిస్ట్ కూడా.

ఆమె తాజా ఎగ్జిబిషన్....సోల్ ఆఫ్ ఏ ఉమెన్.

ఎగ్జిబిషన్‌లో కనిపించే 30 పీస్‌లలో ప్రతి దాంట్లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. చరిత్ర నుంచి కవిత్వం వరకు ఏదో ఒక అంశ ధ్వనిస్తుంది.

'ఆర్ట్‌లో సైన్స్ ఉంటుంది. సైన్స్‌లో ఆర్ట్ ఉంటుంది' అనే పాయల్ జైన్‌ను ఆర్ట్ సైంటిస్ట్‌గా పిలుచుకోవచ్చు.

ఫ్యాషన్ ఇండస్ట్రీలో తన మూడు దశాబ్దాల ప్రయాణానికి 'సోల్ ఆఫ్ ఏ ఉమెన్' ప్రతిబింబం అంటుంది పాయల్. ఈ ఎగ్జిబిషన్‌లోని ముప్ఫై పీస్‌లలో ప్రతి పీస్‌కు ఏదో ఒక ప్రత్యేకత ఉంది. మెక్సికన్ పెయింటర్ ఫ్రీదా ఖాలోను స్ఫూర్తిగా తీసుకొని 'ఫర్‌బిడెన్ లవ్' కలెక్షన్ రూపొందించింది. పాయల్ అభిమానించే ఖాలో పెయింటర్, మ్యాజికల్ సర్రియలిస్ట్, ఫెమినిస్ట్, రెవల్యూషనరీ.

పాయల్ ఆర్కిటెక్చర్ నుంచి ఫ్యాషన్ రంగంలోకి రావడానికి కారణం చిత్రకళ పట్ల తనకు ఉన్న అనురక్తి. స్కెచ్చింగ్ తనకు ఇష్టమైన పని. ఆమె తల్లి కూడా ఆర్టిస్టే. సితార్ అద్భుతంగా వాయించేది. తన కలల గురించి తల్లి దండ్రులకు చెప్పినప్పుడు ' ఏదో ఒక డిగ్రీ నీ చేతిలో కనిపించాలి. ఆ తరువాతే ఏదైనా' అన్నారు. అలా బీకామ్ పూర్తి చేసింది.

పాయల్ స్కెచ్చింగ్ నైపుణ్యాన్ని చూసి 'నువ్వు ఫ్యాషన్ ఇండస్ట్రీలో ప్రయత్నించవచ్చు' అని సలహా ఇచ్చారు సన్నిహితులు. మొదట ఫ్యాషన్ ఇండస్ట్రీకి సంబంధించి పుస్తకాలు, మ్యాగజైన్స్ విరివిగా చదివేది. అలా ఫ్యాషన్ కూడా తన ప్యాషన్‌గా మారింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది.

'ఫ్యాషన్‌కు ఆర్ట్, సైన్స్ అనే రెండు కోణాలు ఉంటాయి. ఆర్ట్ అనేది సృజనాత్మకతకు సంబంధించిన కోణం, సైన్స్ అనేది సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన కోణం. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ నా దృష్టిని విశాలం చేసింది. ప్యాటర్న్‌మేకింగ్, డ్రాపింగ్, గ్రేడింగ్, ఇలస్ట్రేషన్, ఫ్యాషన్ మార్కెటింగ్...ఇలా ఎన్నో విషయాలను తెలుసుకున్నాను' అంటున్న పాయల్


సోల్ ఆఫ్ ఏ ఉమెన్

ఎన్నో కార్పొరేట్ హోటల్స్‌కు ఆకట్టుకునేలా 'హోటల్ యూనిఫామ్'ను డిజైన్ చేసి ఇచ్చింది.

'డిజైనర్స్ అంటే గొప్ప ఏమీ కాదు. గ్లోరిఫైడ్ టైలర్స్ మాత్రమే' అని చాలా మంది అనుకొని అపోహపడే కాలంలో డిజైనర్‌గా కెరీర్ ప్రారంభించింది పాయల్. ఆమె వెస్ట్రన్ క్లాతింగ్ మొదలుపెట్టినప్పుడు దానికి మార్కెట్ లేదు. అయితే ఆ తరువాత మాత్రం పరిస్థితిలో మార్పు వచ్చింది.

పాయల్ సక్సెస్ మంత్రా ఏమిటి?

ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

'చేయాలి కాబట్టి చేస్తున్నాం అనే ధోరణిలో కాకుండా మనం చేస్తున్న పనిని మనసారా ప్రేమించాలి. నిద్ర, శ్వాస, కలలో మన లక్ష్యం కనిపించాలి. ఫెయిల్యూర్‌కు చోటివ్వకుండా సాంకేతిక జ్ఞానంపై గట్టి పట్టు సంపాదించాలి. ఎప్పటికప్పుడు మన ఆలోచనల్లో కొత్తదనం వచ్చేలా చూసుకోవాలి. ప్రశంసలు ఆస్వాదించడానికి మాత్రమే పరిమితమైపోకుండా అన్ని కోణాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. మార్పులు చేర్పులు చేసుకోవాలి. సానుకూల శక్తి, సంకల్పబలం ఎప్పటికీ మనకు తోడుగా ఉండాలి'

కెరీర్ తొలి రోజుల్లో తాను ఎదుర్కొన్న ఆటుపోట్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది పాయల్. చేదుజ్ఞాపకాలుగా కాదు...ఆ సమయంలోనూ తాను ఎంత ధైర్యంగా ఉందో మళ్లీ మళ్లీ గుర్తు తెచ్చుకోవడానికి.

'విజయం ధైర్యవంతులను వెదుక్కుంటూ వస్తుంది' అని చెప్పడానికి ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఆమె తెచ్చుకున్న పేరే నిదర్శనం.

సినిమా

ప్రతి కణం కణం...


సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్

టైగర్, జోయాల ప్రేమ బలమైనది. ప్రేయసి మీద తనకున్న ప్రేమను వ్యక్తపరచడానికి 'మెరిసే నీ కనులే.. ముసిరే నీ కనులే..', 'ప్రతి కణం.. కణంలో...' అంటూ పాట అందుకున్నారు టైగర్. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'టైగర్ జిందా హై'కి సీక్వెల్‌గా రూపొందిన 'టైగర్ 3'లోని పాట ఇది. టైగర్‌గా సల్మాన్ ఖాన్, జోయాగా కత్రినా కైఫ్ నటించగా మనీష్ శర్మ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలోని రెండో పాట 'ప్రతి కణం కణం..'ను మంగళ వారం రిలీజ్ చేశారు. ''ఈ పాట టైగర్, జోయాల అన్యోన్యతను ఆవిష్కరించే విధంగా ఉంటుంది. ఆ కెమిస్ట్రీని సిల్వర్ స్క్రీన్‌పై చూసి, అనుభూతి చెందాల్సిందే. అందుకే వీడియోను ముందుగా రిలీజ్ చేయలేదు'' అన్నారు ఆదిత్యా చోప్రా. ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది.

యాత్రలో జర్మనీ నటి సుజానే



'యాత్ర' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'యాత్ర 2'. ఇందులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమాలో సోనియా గాంధీ పాత్రని జర్మనీ నటి సుజానే బెర్నెర్ట్ పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మహి వి. రాఘవ్ మాట్లాడుతూ–''యాత్ర'కి కొనసాగింపుగా 'యాత్ర 2' రూపొందుతోంది. వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనలను ఈ చిత్రంలో చూపిస్తున్నాం. 'యాత్ర 2'ని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం '' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

నా తలరాతే రంగుల రంగోలి...


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు అభిమానుల్లో దీపావళి పండగ సంబరం ఆరంభమైంది. జోష్‌గా పండగ చేసుకునేలా మహేశ్‌బాబు హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం' నుంచి 'దమ్ మసాలా...' పూర్తి పాటను విడుదల చేశారు. ఈ చిత్రదర్శకుడు త్రివిక్రమ్ పుట్టినరోజు (నవంబర్ 7) సందర్భంగా మంగళవారం ఈ పాటను రిలీజ్ చేశారు. చిత్ర సంగీతదర్శకుడు తమన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా సంజిత్ హెగ్డే, జ్యోతి నూరన్ ఆలపించారు. ''నా తలరాతే రంగుల రంగోలి.. దిగులైనా చేస్తా దీవాలి.. నా నవ్వుల కోటని నేనే ఎందుకు పడగొట్టాలి', 'నేనో నిశ్శబ్దం.. అనునిత్యం నాతో నాకే యుద్ధం' అంటూ సాగే ఈ పాట హీరో పాత్ర తీరుని తెలియజేసే విధంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. మహేశ్ సరసన శ్రీలీల కథానాయికగా, మీనాక్షీ చౌదరి, జగపతిబాబు, జయరామ్, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ తదితరులతో ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.


అనూ ఇమ్మాన్యుయేల్

దీపావళి మనసుని హత్తుకుంటుంది – 'స్రవంతి' రవికిశోర్



''ఇప్పుడు ప్రేక్షకులు పెద్ద చిత్రాలతో పాటు చిన్న సినిమాలు కూడా చూస్తున్నారు. మా 'దీపావళి' చిన్నదైనా అందమైన సినిమా. ఇందులోని భావోద్వేగాలు ప్రేక్షకుల మనసులను హత్తుకుంటాయి'' అని నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ అన్నారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రల్లో ఆర్‌ఏ వెంకట్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'కీడా' (తెలుగులో 'దీపావళి'). కృష్ణ చైతన్య సమర్పణలో 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''నిర్మాతగా 38 ఏళ్ల జర్నీలో దాదాపుగా నేను చేసిన సినిమాలన్నీ సంతృప్తినిచ్చాయి. నేను డబ్బుల గురించి ఆలోచించను. ప్రేక్షకులకు సినిమా కనెక్ట్ అవుతుందా? లేదా అని మాత్రమే ఆలోచిస్తా. కథ పూర్తయ్యాకే సినిమాని సెట్స్ మీదకు తీసుకెళతాను. ఓ సినిమా పూర్తయ్యాకే మరొకటి చేస్తాను. నేను తక్కువ సినిమాలు చేయడానికి కారణం అదే. 'దీపావళి' కథని ప్రాణం పెట్టి రాశాడు వెంకట్. చెప్పిన కథను చెప్పినట్లు స్క్రీన్ మీదకు తీసుకొచ్చాడు. మా సినిమా ఇండియన్ పనోరమాకి ఎంపికవడం గొప్ప అనుభూతి. చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించడం సంతోషంగా ఉంది. ఇక రామ్ హీరోగా ఓ సినిమా చేసేందుకు స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అలాగే రామ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాలని ఉంది. ఇందుకు సరైన కథ కుదరాలి'' అన్నారు.

జపాన్‌లో నటిగా కనిపిస్తాను

''జపాన్' వైవిధ్యమైన చిత్రం. చాలా క్రేజీగా ఉంటుంది. ఈ దీపావళికి పర్ఫెక్ట్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. తప్పకుండా అందరూ థియేటర్స్‌లోనే చూడాలి'' అని హీరోయిన్ అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 10న రిలీజవుతోంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా అనూ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ– ''రాజు మురుగన్‌గారి సినిమాలు వైవిధ్యంగా ఉంటాయి. అలాగే 'జపాన్' కూడా. ఈ చిత్రంలో ఓ నటిగా కనిపిస్తా. నా పాత్ర జపాన్ (కార్తీ) లైఫ్‌లో కీలకంగా ఉంటుంది. ఇక ఫలానా పాత్ర చేయాలనే కలలు నాకు లేవు. ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు.

వారి మాటలే నాలో స్ఫూర్తి నింపాయి – సురేష్ కొండేటి



''సంతోషం' సినీ వారపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా 'ఫిల్మ్ ఫేర్' అవార్డుల్లాగా సంతోషం అవార్డులు ఇస్తే బాగుంటుందని నాగార్జునగారు అన్నారు. దీంతో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్'ని ప్రతి ఏటా ఇస్తున్నాను. అలాగే నన్ను నిర్మాతగా చూడాలని చిరంజీవిగారు అనడంతో నిర్మాత అయ్యాను. వారిద్దరి మాటలు నాలో స్ఫూర్తి నింపడంతో ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను'' అని నిర్మాత, 'సంతోషం' సినీ వార పత్రిక అధినేత సురేష్ కొండేటి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ నెల 18న హైదరాబాద్‌లో 'సంతోషం ఓటీటీ అవార్డ్స్'ని ఇస్తున్నాం. డిసెంబరు 2న గోవాలో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం. ఈ వేడుకకు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరవుతారు. సంతోషం అవార్డ్స్‌ని 25ఏళ్ల పాటు కొనసాగించాలనుకున్నాను. ఇప్పటికి 22 ఏళ్లయింది. ఇంకో మూడేళ్లు కచ్చితంగా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహిస్తాను. మరోవైపు సినిమాలు నిర్మిస్తున్నాను. నటుడిగా ఐదారు సినిమాల్లో కీ రోల్స్ చేస్తున్నాను'' అన్నారు.

లవ్.. థ్రిల్...

హృతిక్ శౌర్య హీరోగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'అశ్వత్థామ'. 'హతః అశ్వత్థామ' అనేది ఉపశీర్షిక. చంద్రశేఖర్ ఆజాద్ పాటిబండ్ల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఫ్లిక్‌నైన్ స్టూడియో సంస్థ నిర్మిస్తోంది. హృతిక్ శౌర్య బర్త్‌డే సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ – ''ఓ టు'తో హృతిక్ హీరోగా కెరీర్ ప్రారంభించారు. అందులో సాఫ్ట్ కుర్రాడిగా కనిపించిన ఆయన 'అశ్వత్థామ'లో కమర్షియల్ హీరోగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం హృతిక్ చేసిన యాక్షన్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్, క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇది'' అని అన్నారు.


హృతిక్ శౌర్య

పాటల్లో నవరసాలుంటాయి – సుభాష్ ఆనంద్



''అలా నిన్ను చేరి' సినిమాలోని ప్రతీ పాట అద్భుతంగా ఉంటుంది. ఒక్కో పాటను ఒక్కో శైలిలో కంపోజ్ చేసే చాన్స్ నాకు దొరికింది. నవరసాలను చూపించేలా ఇందులోని పాటలుంటాయి'' అని సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ– ''ఫీల్ గుడ్ లవ్ స్టోరీ చిత్రమిది. ప్రేమ కథా చిత్రాలకు సంగీతమే ప్రాణం. నేను చాలా సినిమాలకు సంగీతం అందించాను. అయితే 'అలా నిన్ను చేరి' నా కెరీర్‌కి గుడ్ టర్న్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

ఆరుగురి కథ


'టెనెంట్'లో ఓ దృశ్యం

'సత్యం' రాజేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. ఇందులో మేఘా చౌదరి హీరోయిన్. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వై. యుగంధర్ మాట్లాడుతూ– ''జీవితం ఆడే వైకుంఠ పాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు ముఖ్య పాత్రల మధ్య జరిగే కథే ఈ చిత్రం. ప్రస్తుత అర్బన్ లైఫ్ జీవన శైలిలో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ తయారు చేసిన ఈ కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: జెమిన్ జోం అయ్యనీత్, సహనిర్మాత: ఎస్. రవీందర్ రెడ్డి.